క్లుప్తంగా

విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం



సర్పాపురంలో విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం నర్సాపురంలో రూ.2.64 కోట్లతో నిర్మించిన 132/33 విద్యుత్ ఉపకేంద్రాన్ని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన నియోజకవర్గంలో రైతులకు విద్యుత్‌ను అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సబ్‌స్టేషన్లను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఈఈ శ్రీధర్ వర్మ, డీఈ చిట్టిరాజు, ఏఈ మదర్సాపాల్గొన్నారు. అలాగే శ్రీరంగపట్నంలో రూ.75 లక్షలతో నిర్మించిన మల్టీ పర్పస్ గోడౌన్‌ను ఎమ్మెల్యే రాజా ప్రారంభించారు. అలాగే రూ.80 లక్షలతో కాపవరంలోని చెరువు వద్ద వాకింగ్ ట్రాక్, బండ లెవెలింగ్ పనులు, ఓపెన్ జిమ్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమిని చిత్తుగా ఓడించాలి



ఊలపల్లిలో చేయూత నమూనా చెక్కు అందిస్తున్న నాయకులు

బిక్కవోలు: ఎన్నికలు సమీపించే కొద్దీ మాజీ సీఎం చంద్రబాబుకు మతిభ్రమిస్తుందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేన కూటమిని చిత్తుగా ఓడించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఊలపల్లి గ్రామంలో చేయూత నాలుగో విడత సొమ్ము పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. తద్వారా వారి అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. ఊలపల్లిలో 520 మంది మహిళలకు రూ.3.59 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. దానికి సంబంధించిన నమూనా చెక్కును లబ్ధిదారులకు ఆయన అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు బండారు శివ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 17 మంది గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణితం-2, బోటనీ, సివిక్స్ పరీక్ష జరిగినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. రంగంపేట, రాజానగరం మండలాలకు చెందిన 439 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 422 మంది పరీక్ష రాశారని, 17 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. డిపార్ట్‌మెంటల్ అధికారులుగా కేవీ సర్వేశ్వరరావు, ఎ.దుర్గాప్రసాద్ వ్యవహరించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ కె.వెంకటరావు కేంద్రాన్ని పరిశీలించారు.

ఘనంగా ధనదుర్గమ్మ జాతర

సీతానగరం: స్థానిక పంచాయతీ వెలమపేటలో కొలువైన ధనదుర్గమ్మ జాతర మహోత్సవం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకుడు దత్తుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో అన్నదానం నిర్వహించారు. సుమారు ఐదువేల మంది భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు.

9న విద్యుత్ అంతరాయం

బిక్కవోలు: సామర్లకోట సబ్ స్టేషన్ నిర్మాణ పనుల్లో భాగంగా సామర్లకోట నుంచి బిక్కవోలు వెళ్లే ప్రధాన 132 కేవీ లైన్ పరిధిలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ శ్రీధర వర్మ తెలిపారు. మండలంలోని బిక్కవోలు, రంగాపురం, బలభద్రపురం, రంగంపేట మండలం సింగంపల్లి, ఆనూరు, అనపర్తి పరిధిలో పేరా రామచంద్రాపురం, రాయవరం ప్రాంతాల్లో ఈ నెల 9న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకూ విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని కోరారు.

పట్టిసీమకు పదపద..

- వీరభద్రుని దర్శనానికి ఏర్పాట్లు
- నేడు లక్ష మందికి పైగా వస్తారని అంచనా
- టెంట్లు, బారికేడ్లు తదితరాల ఏర్పాటు

సీతానగరం: ఆ పరమశివుని కొలిచే వేడుకకు సర్వం సిద్ధమైంది.. ఈ నెల 8న మహా శివరాత్రి రోజున వంగలపూడి రేవు నుంచి ఏలూరు జిల్లాలోని పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి వెళ్లే భక్తులకు గోదావరి పాయపై నడక మార్గాన్ని ఏర్పాటు చేశారు. రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదేశాల మేరకు ఈ రేవులో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. రేవు నుంచి కిలోమీటరు దూరంలో గోదావరి పాయపై పంచాయతీ ఆధ్వర్యంలో ఆరు సిమెంట్ తూరలు వేసి భక్తులు వెళ్లే విధంగా నడక దారి ఏర్పాటు చేశారు. శివరాత్రి సందర్భంగా వంగలపూడి రేవు నుంచి లక్షకు పైగా భక్తులు పట్టిసీమ వెళ్తారని అంచనా. పట్టిసీమకు వెళ్లే భక్తులకు గోదావరి పాయపై వేసిన వారధి ఎంతో ఉపయోగపడనుంది.



వంగలపూడి రేవులో గోదావరి పాయపై వేసిన వారధి

వంగలపూడి రేవు నుంచి కిలోమీటరు దూరంలోని గోదావరి పాయ దాటిన తరువాత అక్కడి నుంచి సుమారు నాలుగు కిలోమీటర్లు ఇసుకలో నడిచి పట్టిసీమ వీరభద్రుని ఆలయానికి భక్తులు చేరుకుంటారు.

వాహనాల ఏర్పాటు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సూచనల మేరకు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు భక్తులకు పలు సౌకర్యాలు కల్పిస్తున్నారు. నడవలేని భక్తులు నగదు చెల్లించి రేవు నుంచి



భక్తుల కోసం ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

గోదావరి పాయ వరకూ ట్రాక్టర్‌పై వెళ్లి గోదావరి పాయపై ఉన్న నడక మార్గం దాటిన తరువాత తిరిగి ట్రాక్టర్‌పై పట్టిసీమ వీరభద్రుని ఆలయానికి చేరుకోవచ్చు. అక్కడ ఏర్పాట్లపై ఎంపీడీఓ కృష్ణప్రసాద్, తహసీల్దార్ రహమాన్, పంచాయతీ రాజ్ జేఈ ప్రసాద్, సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, ఎంపీటీసీ సూరెడ్డి గంగాభవాని, పంచాయతీ కార్యదర్శి ఆర్.సుజాత, వైఎస్సార్ సీపీ నాయకుడు కొంచ భాస్కరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రేవు వద్ద భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరాలు, తాగునీటి ఏర్పాటు, మరుగుదొడ్లు, గోదావరి పాయ వద్ద బారికేడ్లు, లైట్ల ఏర్పాట్లు, గోదావరి పాయపై వేసిన వారధి అంచుల్లో ఇసుక బస్తాలు వేయడం వంటి పలు పనులకు చర్యలు చేపట్టారు. సైకిల్ స్టాండ్‌లో టూ వీలర్లకు రూ.50, కార్లకు రూ.100, ఆటోకు రూ.70 ఫీజు వసూలు చేయడానికి నిర్ణయించారు. రేవు వద్ద భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నారు.

రేవు వద్ద పటిష్ట చర్యలు

పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం వద్ద గోదావరి పాయ నుంచి పట్టిసీమ వీరభద్రుని ఆలయం వరకూ నడిచి వెళ్లడానికి ఇసుక మార్గం ఉంది. పురుషోత్తపట్నం వద్ద గోదావరి పాయ నిలిచిపోగా ఇసుక తిన్నెలు ఏర్పడ్డాయి. దీంతో రామచంద్రపురం రేవు వద్దకు నీటి ప్రవాహం లేదు. వైఎస్సార్ సీపీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గద్దె వీరన్నబాబు తదితరులు భక్తులు వెళ్లడానికి రేవు వద్ద చర్యలు చేపట్టారు. రేవు దిగిన అనంతరం నేరుగా ఇసుక మార్గం ద్వారా పట్టిసీమ వీరభద్రుని ఆలయానికి చేరుకోవచ్చు. వంగలపూడి రేవు నుంచి ఆలయం ఎక్కువ దూరం ఉంటుంది. అదే రామచంద్రపురం నుంచి ఆలయానికి తక్కువ దూరంలో చేరుకోవచ్చు.

ప్రతి ఏడాదీ వెళ్తుంటాం..



పట్టిసీమ వీరభద్రుని ఆలయాన్ని చిన్న కాశీగా పిలుస్తుంటారు. ప్రతి ఏడాది బంధువుల ఇంటికి వచ్చి వంగలపూడి రేవు నుంచి పట్టిసీమ వెళ్తుంటాం. గతంలో భక్తులను గోదావరి పాయ వద్ద పడవలపై దాటించే వారు. మూడేళ్ల నుంచి నేరుగా భక్తులు నడిచి వెళ్లడానికి మార్గం ఏర్పాటు చేశారు. నడవ లేనివారు ట్రాక్టర్లపై వెళ్లడానికి చర్యలు తీసుకున్నారు. రేవు వద్ద అన్నదానం కూడా నిర్వహిస్తున్నారు.

–పలివెల ప్రవీణ్‌కుమార్, హైదరాబాద్

రామచంద్రపురం నుంచి చక్కగా..



రామచంద్రపురం రేవు నుంచి భక్తులు పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి వెళ్లేందుకు నడక మార్గం ఉంది. అసలు నీరు లేకుండా నేరుగా ఇసుక తిన్నెలపై నుంచి నడిచి వెళ్లవచ్చు. ఇక్కడ నుంచి పట్టిసీమ వీరభద్రుని ఆలయం చాలా దగ్గరగా ఉంటుంది. రేవు నుంచి నేరుగా ఇసుక తిన్నెలపై నడుచుకుంటూ ఆలయానికి చేరుకోవచ్చు. భక్తులకు పలు సౌకర్యాలు కల్పించాం.

–చల్లమళ్ల సుజీరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు, రామచంద్రపురం

అన్ని ఏర్పాట్లూ చేశాం



వంగలపూడి రేవు నుంచి భక్తులు తరలి వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. వాహనాలు నిలపడానికి సైకిల్ స్టాండ్, భక్తులు తరలి వెళ్లడానికి ట్రాక్టర్లు ఏర్పాటు చేశాం. రేవులో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహిస్తాం. గోదావరి పాయ అటు, ఇటు వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు జరుపుతున్నాం. ఇవే కాకుండా ఏ ఇబ్బందీ రాకుండా చూస్తాం.

–కొంచ అన్నపూర్ణ, సర్పంచ్, వంగలపూడి

ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం



ఇందిర దంపతులను సత్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి

పెదపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత టి.ఇందిర, ప్రకాశరావు దంపతులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సత్కరించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమెను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండు సత్యనారాయణ, ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి పాల్గొన్నారు.

పని దినాలు సద్వినియోగం చేసుకోవాలి

రంగంపేట: ఉపాధి హామీ కూలీలు వంద రోజుల పనిదినాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అంబుడ్స్ పర్సన్ ఎస్.ఖాదర్ బాషా సూచించారు. మండలంలోని వడిశలేరు, సింగంపల్లి, నల్లమిల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ ఇచ్చిన కొలతలు పూర్తి చేసి రోజుకు రూ. 272 వేతనం పొందాలన్నారు. ఉపాధి కూలీలకు అందుతున్న వేతనాలు, పని వద్ద సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ జి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి పథంలో అతివల పయనం

- వారి సంక్షేమానికి సీఎం జగన్ ప్రాధాన్యం
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మహిళలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గాడాల పొన్నాలమ్మ దేవాలయం సమీపంలో గురువారం జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడంతో సమాజాభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. రాజానగరం నియోజకవర్గంలో రూ.1,158 కోట్లతో అభివృద్ధి, మరో రూ.1,142 కోట్ల తో సంక్షేమ పథకాలను అమలు జరిపినట్టు తెలిపారు. సొంతిల్లు లేని 20,172 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశామన్నారు.

వ్యవసాయానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతిచ్చిందన్నారు. విత్తనం నుంచి పంట విక్రయాలు జరిగే వరకూ బాధ్యత తీసుకుందన్నారు. నియోజకవర్గంలో ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్లతో పాటు, జగనన్న పాలవెల్లువ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 9 గంటల విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేందుకు నియోజకవర్గంలో ఐదు 132/33 కేవీ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని, దానిలో భాగంగా రాజానగరం మండలం వేపకాయలదిబ్బలో 220/33 కేవీ లైన్ విద్యుత్ ఉపకేంద్రాన్ని నిర్మిస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో రూ.38 కోట్లతో సాగునీటి పథకాలు, రూ.22 కోట్లతో తొర్రిగెడ్డ కాలువ ఆధునీకరణ పనులు నిర్వహించామన్నారు. కోరుకొండ



నమూనా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మండలంలో ఆసరా నాలుగో విడతలో 1,575 సంఘాలకు రూ.14.38 కోట్లు, చేయూత ద్వారా 4,404 మందికి రూ.8.26 కోట్లు అందిస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌ను సభకు పరిచయం చేశారు. ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా శ్రీనివాస్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కోరుకొండ మండలానికి చెందిన చెక్కులను ఆవిష్కరించారు.

విజన్ లేని చంద్రబాబు

వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ విజన్‌లేని చంద్రబాబును నమ్ముకుంటే రాష్ట్రం నట్టేట మునుగుతుందన్నారు. సేవల్లో ముందున్న తమ కుటుంబం అక్షయ అమృతం ద్వారా మధ్యాహ్న భోజన వసతిని ప్రజలకు అందిస్తున్నామన్నారు. జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణ మూడు రోజులే నిర్వహించి మూసేశారన్నారు. కార్యక్రమంలో కోరుకొండ ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్యసూర్య కుమారి, కె.రాజారమాదేవి, అప్పలనర్సమ్మ, ఉమ, పార్టీ కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసయ్య, నాయకులు శరనివారపు ధనరాజ్, చాటపర్తి దుర్గారావు పాల్గొన్నారు.

మహిళా అభ్యుదయానికి 'చేయూత'

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- వైఎస్సార్ చేయూత సాయం పంపిణీ

అనపర్తి: మహిళా అభ్యుదయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూత అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నాలుగో విడత ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గురువారం స్థానిక తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో సర్పంచ్ వారా కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు సుస్థిరమైన ఆదాయ మార్గాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 45 నుంచి 60 ఏళ్ల లోపు ప్రతి బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ. 18,750 చొప్పున నాలుగేళ్లపాటు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందని ప్రకటించిన సందర్భంలో ప్రతిపక్షాలు వ్యంగ్యాస్త్రాలు సంధించాయన్నారు. అయితే అక్కచెల్లెమ్మలకు ఓ అన్నగా, తమ్ముడిగా అండగా ఉంటానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేయూత పథకం నాలుగో విడత ఆర్థిక సాయం కూడా అందించి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని అన్నారు. జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రి లక్ష్మీప్రియ తదితరులు మాట్లాడుతూ అక్కచెల్లెమ్మల జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు నింపారన్నారు. అనంతరం వైఎస్సార్ చేయూత ద్వారా



పందలపాకలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

మండలంలో 2,672 మందికి రూ. 5,01,00,000 ఆర్థిక సాయానికి సంబంధించిన మెగా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. సీఎం జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. వైస్ ఎంపీపీ కర్రి దాసు, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కోనాల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

- పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి గ్రామ పరిధిలో 926 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

బిక్కవోలు: సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బిక్కవోలులో రెండు సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలతో పాటు రూ.22 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, శెట్టిబలిజ పేటలో కమ్యూనిటీ హాలును ఆయన ప్రారంభించారు. పందలపాకలో 14, 15 ఆర్థిక సంఘ నిధులతో 16 ఎకరాల కాలనీలో మెటల్ రోడ్డు పనులను, సరిపల్లిపేట తుర్పు కాపుల కమ్యూనిటీ హాలును ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. బిక్కవోలు సర్పంచ్ సరెళ్ల సుమలత, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, ఉప



అనపర్తిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

సర్పంచ్ జంగా మురళీకృష్ణరెడ్డి, పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, మాజీ జెడ్పీటీసీ సత్యనారాయణ, హరి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
Creditor I.P. No. 1/2024

Between:
Karri Veera Venkata Satyanarayana Rama Krishna Reddy –పిటీషనర్
AND
R-1: Nallamilli Sridevi, W/o. Appa Reddy, aged 43 years, Business, R/o. D.No. 5-327, Anaparthi Village, Anaparthi Mandal, E.G.Dist., Presently R/o. Paradesipalem, Jnuram Colony (PP Colony-1), Block No.12 F/6, Visakha Rural Mandal, Visakhapatnam District.
R-2: Nallamilli Sai Rama Krishna Reddy, S/o. Appa Reddy, aged 20 years, Student, R/o. D.No. 5-327, Anaparthi Village, Anaparthi Mandal, E.G.Dist., Presently R/o. Paradesipalem, Jnuram Colony (PP Colony-1), Block No.12 F/6, Visakha Rural Mandal, Visakhapatnam District.
–1, 2 రెస్పాండెంట్లు

పై గ్రంథములో 1వ ప్రతివాది 2వ ప్రతివాదికి వ్రాసి ఇచ్చిన సెటిల్‌మెంట్ దస్తావేజు నెం. 2850/2023, Dt. 4-9-2023, SRO, అనపర్తి సబ్ రిజిస్ట్రారులో రిజిష్టరు కాబడిన సెటిల్మెంట్ దస్తావేజు చెల్లదని మరియు 1వ ప్రతివాదిని ఇన్సాల్వెంటుగా డిక్లేర్ చేయమని పిటిషనర్ పై కోర్టులో గ్రంథము దాఖలు చేసియున్నారు. కావున ఎవరికైనా పై గ్రంథములో ఎటువంటి అభ్యంతరములు ఉన్న ఎడల ది. 20-3-2024వ తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 గం॥లకు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనిచో కోర్టు చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకొందురు.

అనపర్తి 7-3-2024 — వి.బాబు భాస్కరరావు, అడ్వకేటు, అనపర్తి

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వరూపారాణిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబాబు తదితరులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ అసిస్టెంట్ బేబీ స్వరూపారాణిని సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం, ఆదాయం, విజ్ఞానం కలిగిన మహిళలే నేటి భారతావనికి పునాదిరాళ్లని అన్నారు. అనంతరం కామర్స్ అధ్యాపకురాలు నామా మీనాక్షి కళాశాలకు చేస్తున్న సేవలకు గాను అధ్యాపకులు ఉమెన్ ఆఫ్ ది కాలేజ్ అనే బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.హరేరామకృష్ణ, మదీనా, నాగేశ్వరరావు, మాధవ్, ఫణీంద్ర, శివ, వాణి, వరలక్ష్మి, మనోహరి, అలేఖ్య పాల్గొన్నారు.

- బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు కె.పాపారత్నం, రేష్మ, సబీనా అహ్మద్, మాచరమ్మ, ఆదిలక్ష్మిని ఘనంగా సన్మానించారు.
- సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో హెచ్ఎం కె.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు సూర్యకుమారి, పుష్ప, సరళ, నిర్మల రాజేశ్వరి, సూర్యకళలను సన్మానించారు. పీడీలు సింహాద్రి, శంకరరావు, బ్రహ్మజీ, రామకృష్ణ పాల్గొన్నారు.

రాజానగరం: గైట్ డిగ్రీ కళాశాల, గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ న్యాయవాది వి.ఉమామహేశ్వరి, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ బి.కేజియారాణి మాట్లాడారు.

- ఫార్మసీ కళాశాలలో జరిగిన సదస్సులో జీఎస్ఎల్ వైద్య కళాశాల గైనకాలజిస్టు విభాగం హెచ్ఓడీ డాక్టర్ యాళ్ల అన్నపూర్ణ ఉపన్యసించారు.

అన్ని రంగాల్లో రాణించాలి

పెదపూడి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ కేత తులసి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పుట్టకొండలో గురువారం సర్పంచ్ వల్లు వెంకటరమణ ఆధ్వర్యంలో మహిళలకు సన్మానం చేశారు. సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, ఆశ కార్యకర్తలు, యానిమేటర్లు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులను సత్కరించారు. ఎంపీపీ తులసి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారన్నారు. ఒళ్ల వెంకటరమణ మాట్లాడుతూ సీఎం జగన్ హయాంలోనే మహిళలకు రాజకీయ రంగంలో ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేస్తున్నారన్నారు. ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి, సుధాకర్ బాబు, ఉప సర్పంచ్ మిరియాల శ్రీను, సచివాలయ కార్యదర్శి చిన్ని, సంపర పీహెచ్‌సీ వైద్యురాలు శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శివలింగాకృతులు



పప్పు దినుసులతో సతీష్ తీర్చిదిద్దిన శివ లింగాకృతులు

అనపర్తి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక పాతవూరుకు చెందిన వేదపండితుడు రెడ్డి సురేష్‌శర్మ నివాసంలోని శ్రీబాల రాజేశ్వరి పీఠంలో ఏర్పాటు చేసిన 11(ఏకాదశ) శివ లింగాకృతులు భక్తులను ఆకట్టుకున్నాయి. సురేష్‌శర్మ సోదరుడు సతీష్ పప్పు దినుసులను వినియోగించి శివ లింగాకృతులను తీర్చిదిద్ది వాటిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఐదేళ్లుగా సతీష్ క్రమం తప్పకుండా వివిధ వస్తువులు వినియోగించి శివలింగాకృతులను రూపొందిస్తున్నారు.

ముగిసిన నృసింహస్వామి సుదర్శన యాగం

మధురపూడి: కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అష్టముఖ గండభేరుండ లక్ష్మీనరసింహస్వామి సుదర్శనయాగం గురువారంతో ముగిసింది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సతీమణి రాజశ్రీ భక్తి శ్రద్ధలతో యాగాన్ని నిర్వహించారు. లోక కల్యాణార్థం నిర్వహించిన ఈ కార్యక్రమంతో కోరుకొండలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆలయ అనువంశిక ధర్మకర్త పరాశర రంగరాజ బట్టర్ ఆధ్వర్యంలో వేద పండితులు పాణంగపల్లి రవిచార్యులు, పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు, వాడపల్లి దేవస్థానానికి చెందిన పెద్దింట అభిరామాచార్యులు, పెద్దింటి చంటిబాబు మంత్రోచ్చారణ నడుమ దేవస్థానంలో గోవింద నామస్మరణ మార్మోగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పార్టీ నాయకులు గంధం నారాయణరావు, అడబాల చినబాబు, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, కేతినీడి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ధరిత్రి అవార్డుకు శైల ఎంపిక



ఉపాధ్యాయిని శైల

రంగంపేట: చిత్తశుద్ధితో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న రంగంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని కండే శైల ధరిత్రి అవార్డుకు ఎంపికయ్యారు. ఇప్పటి వరకూ కురుగొండ, దాసూరు, దొడ్డిగుంట, రంగంపేట జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసి విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దారు. ఆమె చేసిన కృషిని రంగంపేట, స్నేహ, కళావాణి సంస్థలు గుర్తించి శుక్రవారం రంగంపేటలో జరిగే మహాశివరాత్రి సందర్భంగా ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ధరిత్రి అవార్డు అందించనున్నాయి.